కట్నం

అయినా నన్ను నేను చెప్పుతో కొట్టుకోవాలి. ఇంత చదువు చదివీ, అంతో ఇంతో ఆస్తిపాస్తులుండీ, నలుగురిలో చాలా మంచి వాడన్న పేరుండీ, పరోపకారానికి పోయి కుడితిలో పడ్డాను. ఏ విషయంలోనూ నాకంటే గొప్పవాడు కానటువంటి ఆ గోపాలం గాడు యాభై వేలు కట్నం డబ్బులు డిమాండ్ చేయడం మూలంగా గొప్పవాడై పోయాడు. పైసా కట్నం వద్దూ అన్నందుకు నేను వెధవనై పోయాను. నా మానావ నేను గమ్మునుండడం మానేసి, పక్క వీధిలో ఒకానొక పెళ్ళి కావలసిన అమ్మాయి కష్టాల్లో వుందనీ, అబ్బాయి తరవు వాళ్లు యాభై వేలు అడుగుతున్నారనీ, ఇల్లమ్మినా అంత డబ్బు రాదనీ, గత్యంతరం లేని పరిస్థితులలో ఆ పెళ్ళి ఎక్కడ ఆగిపోవలసి వస్తుందనీ కీడెంచి, ఎప్పట్నుంచో గుండెలో దాచుకొన్న పెళ్లికి 'కట్నం' తీసుకో కూడదన్న త్యాగ గుణం, మంచి గుణం పెల్లుబికి ఆ విషయం అమ్మాయి తరవు వారికి తెలియజేశాను నా బయోడేటాతో సహా, 'పైసా కట్నం అవసరం లేదనీ, అమ్మాయికి నచ్చితే నేను రెడీ' అని. అటు వైపు నుంచి ప్రశంసల వర్షం కురుస్తుందనీ, పెళ్ళి కూతురి దృష్టిలో నేను పెద్ద హీరోలా కనబడతాననీ, ఆదర్శవాదిననీ, అభ్యుదయ ధీరుడననీ, అదనీ, ఇదనీ, ఏదేదో ఊహించుకొన్నాను. రెస్పాన్స్ రానే వచ్చింది. కానీ అక్కడ నా బతుకు నాశనమై పోయింది. నా పేరు, ప్రతిష్ఠలు గంగలో కలసిపోయి నామంచి నన్ను వెక్కిరిస్తోంది.

"అబ్బాయి మంచి వాడు కాదట. ఏదో లోపం కూడా వుండి వుంటుంది. లేదంటే కట్నం లేకుండా ఈ కాలంలో పెళ్ళి చేసుకొనే నాథుడేడీ" అని, "అప్పో, సప్పో చేసి, ఆ యాభై వేల సంబంధం ఖాయం చేయండి. అప్పు ఈ రోజు కాకుంటే రేపయినా తీర్చుకోవచ్చు. ఈ చచ్చు సంబంధం చేసి అమ్మాయి బతుకు నాశనం చేయలేము. "ఏమ్మా! నీ అభిప్రాయం ఏమిటి?" పెళ్ళి కూతురి తండ్రి.

"ఏమో నాన్నా! నాకూ అనుమానంగానే వుంది. కట్నం ఎందుకు వద్దంటున్నాడో" అని.

చాలు! ఇంతకాలం స్త్రీ జాతి మీద నేనుంచుకొన్న గౌరవానికీ, సమాజంలో మంచికీ, మంచికి జరిగే అవమానానికీ...!

(అప్పుచేసి తనకి గుడి కట్టించి జైలు పాలైన రామదాసుకి కనపడని రాముడు, రామదాసుని జైల్లో పెట్టించిన తానీషాకి దర్శనం ఇచ్చినట్లే, కట్నం వద్దనే వాడి మొఖాన పేడ వేసే స్త్రీ శిరోమణులకు అంకితం.)

—కాసల కృష్ణమూర్తి

చుట్టూ దీపాలే మధ్యంతా చీకటి

శవం తల పక్కన పెట్టిన దీపం
శవానికి వెలిగిస్తుంది గాని
జీవితాన్ని వెలిగించదు-
నిర్గహం ముందు వెలిగించిన దీపం
రాతిలోని ఎత్తుపల్లాల్ని చూపిస్తుంది గాని
మనస్సులోని చీకట్ని అంతం చెయ్యదు-
వధువు కళ్ళలో మొదటి రాత్రి ప్రతిఫలించిన దీపం
రెండో రాత్రికి వెలుగుతుందన్న గ్యారంటీ లేదు-
ఎన్నికల్లో ఒలికిన ప్రజల రక్తంతో
రంగవల్లులు పెట్టిన గద్దె పక్కన వెలిగించిన దీపం
గద్దెనెక్కిన వాడి భవిష్యత్తుని వెలిగిస్తుంది గాని
వ్యవస్థ కంట్లో నీడల్నే కొడుతుంది-
ఆకలి కారుతున్న గుడిసెలో
బిచ్చగత్తె తన శరీరాన్ని
యింకా యింకా స్పష్టంగా చూపించడానికి
యింకా యింకా ఒత్తి పెద్దది చేసిన దీపం చివరి రెవరెన్సల్లో
మృగాలు అవురావురుమంటూ విసిరిన పంజాలు
అందంగా మెరిసిపోనన్న గాని
ఒక జాతి సంస్కృతి కొండెక్కిపోతుంది-
రోడ్డు పక్కన నాలుక్కర్రలు పాతి
చిరుగుల గోనెపంచలు వేళ్లాడేసిన 'యింట్లో'
అర్ధరాత్రి గుక్కపట్టి లేచిన పసివాణ్ణి చూడ్డానికి
తల్లి వెలిగించిన దీపం

యింటి పక్కన ప్రవహించే
మూత్రధారల్లోకి యింకిపోతుంది-
రాత్రి ఏ వేళనో రైలాగిన బిక్కుబిక్కుమనే స్టేషన్లో
స్టేషన్ మాస్టరు చూపించిన దీపంలో
ప్రయాణీకుడి బావురుమనే గుండెలోని ఒంటరితనం
ప్రతిబింబించవచ్చు గాని
రైలు ప్రయాణం గమ్యం చేరుతుందన్న నమ్మకం లేదు-
వార్డుకుడి దగ్గర నుండి
బుద్ధుడు, వివేకానందుడు, మదర్ థెరిసా దాకా
వ్యవస్థ మార్పుకోసం ప్రాణాలార్పుకునే
నేటి త్యాగమూర్తుల దాకా
మానవత్వం కోసం ప్రాణాగ్ని దహించకోసే
ఒక్కొక్కరూ ఒక్కొక్క దీపం-
ఆ దీపాలు తమ కాంతి పాకినంత మేరా
వెలుతురు ఇద్దాలు విరజిమ్ముతూ ఉంటై-

—అద్దేపల్లి రామమోహనరావు

సమస్యా పూరణం

13.10.89 సంచికలో ఇచ్చిన 'వెలుగు' సమస్యకు దీపావళి పర్వదినాన్ని దృష్టిలో పెట్టుకుని చేసిన పూరణలు అధిక సంఖ్యలో చేరాయి. రెండు ఉత్తమ ఎంట్రీలను ఇక్కడ ప్రచురిస్తున్నాము. విజేతలను అభినందిస్తూ చెరి పాతిక రూపాయలు బహుమతి నంపే ఏర్పాటుచేస్తున్నాము.

— ఎడిటర్

సమస్య: వెలుగు

* అమావాస్య రోజున దీపావళి వెలుగు
చిన్నారుల కన్నులలో సరదాల వెలుగు
కన్నెపిల్లల మనసంతా ఊహలతో వెలుగు
కొత్త జంటల వయసంతా కోర్కెలతో వెలుగు

— మూడెడ్ల అరుణకుమారి, గుడివాడ

* రవి కిరణాలే జగతికి వెలుగు
జాబిలి కిరణాలే రేయికి వెలుగు
అక్షరాస్యతే దేశానికి వెలుగు
నేత్ర దానమే అంధుల పాలిట వెలుగు
'మదర్' (థెరిసా) చల్లని చూపులే
అన్నార్తులకు వెలుగు
వెలుగే ఈ సృష్టికి మూలం
అది లేనిదే సాగదు కాలం

— ఎస్.రఘునాథ్

రు. 50 గెలుపొందండి

ఈ వారం సమస్య

పందెం

గడువు తేదీ: అక్టోబర్ 25